సాక్షి విశాఖపట్నం

సోమవారం, 2, డిసెంబర్, 2024

అదిరన్



ఉత్సాహంగా వైజాగ్ మారథాన్

బీచ్‌రోడ్డులో ఆదివారం ఉదయం జరిగిన 'వైజాగ్ మారథాన్' ఆహ్లాదకర వాతావరణంలో ఉత్సాహభరితంగా సాగింది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ, సంధ్య మెరైన్ సంయుక్తంగా బీచ్‌రోడ్డులో పార్క్ హోటల్ వద్ద నుంచి వైజాగ్ మారథాన్ నిర్వహించాయి. ముందుగా 21 కిలోమీటర్ల పరుగు, తర్వాత 10 కిలోమీటర్ల పరుగు, చివరగా 5, 3 కిలోమీటర్ల పరుగు ప్రారంభమైంది. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో నగరం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

8లో



అపోహలు వీడి అంతం చేద్దాం

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రా మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ జరిగింది. బీచ్‌రోడ్డు పార్క్ హోటల్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఈ ర్యాలీని డాక్టర్ శివానంద్ ప్రారంభించారు. అనంతరం వైఎంసీఏ వద్ద రోడ్డుపై ప్లకార్డులు, 50 మీటర్ల రెడ్‌రిబ్బన్‌ను ప్రదర్శించారు.

8లో

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

కలెక్టర్ హరేందిర ప్రసాద్



8లో

The City of Defence



విశాఖ తీరం.. రక్షణ కేంద్రం

- కే–4 బాలిస్టిక్ మిసైల్ ప్రయోగంతో సత్తా చాటిన వైజాగ్
- విశాఖలో తయారైన అరిహంత్ సబ్‌మెరైన్ నుంచే ప్రయోగం
- వచ్చే ఏడాది మరో న్యూక్లియర్ సబ్‌మెరైన్ జాతికి అంకితం
- రూ.2,192 కోట్లతో ఈఎన్‌సీ పరిధిలో అభివృద్ధి పనులు

భారత నౌకాదళంలో కీలక ప్రాంతంగా విశాఖపట్నం అభివృద్ధి చెందుతోంది. అణ్వాయుధ పరీక్షల్లోనూ తనదైన ముద్ర వేస్తూ విశాఖ తీరంలో బాలిస్టిక్ మిసైల్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. షిప్‌లు, జలాంతర్గాములు, సర్వే వెసెల్స్ తూర్పు నౌకాదళంలో కేంద్రీకృతమవుతున్నాయి. న్యూక్లియర్ సబ్‌మెరైన్లకు కేంద్రంగానూ విశాఖ తీరం ప్రపంచాన్ని శాసిస్తోంది. సిటీ ఆఫ్ డెస్టినీ కాస్త.. సిటీ ఆఫ్ డిఫెన్స్‌గా రూపాంతరం చెందేలా ఏకంగా రూ.2,000 కోట్లకు పైగా నిధులతో తూర్పు నౌకాదళాభివృద్ధి పనులు మొదలయ్యాయి. కేవలం నౌకాదళంలోనే కాకుండా త్రివిధ దళాలకు పెద్దన్న పాత్ర పోషించేలా విశాఖను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

సాక్షి, విశాఖపట్నం : చిన్న ఔట్‌పోస్ట్‌గా 1968లో ప్రారంభమైన తూర్పు నావికాదళం ఇప్పుడు భారత నౌకాదళంలో కీలకంగా ఎదిగింది. తూర్పు తీరం వెంబడి 2,562 కి.మీల విస్తీర్ణంలో స్థావరాలను ఏర్పాటు చేస్తూ తీర పరిరక్షణలో ముఖ్య భూమిక పోషిస్తోంది. దేశంలోని అన్ని సాయుధ దళాల కమాండ్‌లో భౌగోళిక పరంగా 'ది లార్జెస్ట్ కమాండ్'గా విస్తరించి ఉంది. ఈఎన్‌సీలో ప్రస్తుతం 37,000 మంది సిబ్బంది ఉండగా.. ఇందులో 2,895 మంది అధికారులు, 21,085 మంది నావికులు, 3,695 డీఎస్‌సీ సిబ్బంది, 9,689 మంది రక్షణ పౌరులున్నారు. భారత ప్రభుత్వం లుక్ ఈస్ట్ పాలసీ ప్రవేశపెట్టిన తర్వాత సముద్ర వాణిజ్యానికి తూర్పు తీరం ప్రధాన కేంద్రంగా మారడంతో వాణిజ్య నౌకల రక్షణ బాధ్యత కూడా తూర్పు నౌకాదళమే నిర్వర్తిస్తోంది. దీంతో పాటు డీఆర్‌డీఓ కార్యకలాపాలకు కూడా తూర్పు తీరమే వేదికగా మారింది. పలు క్షిపణులు తయారు చేసే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలాజికల్ లేబొరేటరీస్(ఎన్‌ఎస్‌టీఎల్) కూడా విశాఖలోనే ఉంది. ఇలా ఈఎన్‌సీ బలీయమైన శక్తిగా మారింది. అంతే కాదు నేవల్ ఎయిర్ బేస్ ఐఎన్‌ఎస్ డేగాలో జెట్ ఫైటర్లు, మిగ్ 29–కేలపై శిక్షణ అందిస్తున్నారు. మెరైన్ కమాండోలకు శిక్షణ ఇచ్చేందుకు భీమిలి దగ్గరలో ఐఎన్‌ఎస్ కర్ణ, సబ్‌మెరైన్లలో పనిచేసే వారి శిక్షణకు ఐఎన్‌ఎస్ శాతవాహన, నౌకా నిర్మాణంలో ఆర్కిటెక్చర్, హాల్ మౌంట్, సెయిలర్లకు శిక్షణ కోసం ఐఎన్‌ఎస్ విశ్వకర్మ సేవలందిస్తున్నాయి.

త్రివిధ దళాలకు కేంద్ర బిందువుగా...

కేవలం నౌకాదళానికి మాత్రమే కాకుండా త్రివిధ దళాలకూ విశాఖ కేంద్ర బిందువుగా మారేందుకు అడుగులు పడుతున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఇప్పటికే సిద్ధం చేసింది. సాధ్యాసాధ్యాలపై అధ్యయన కమిటీని కూడా ఏర్పాటు చేసింది. రాష్ట్ర విభజనకు ముందు విశాఖ నగరం నౌకాదళానికి, హైదరాబాద్ నగరం సైనిక దళానికి ప్రాతినిధ్యం వహించేవి. విభజన తర్వాత ఏపీలో కేవలం నేవీ మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ కేంద్రాలను కూడా విశాఖలో ఏర్పాటు చేసేందుకు రక్షణ శాఖ సిద్ధమవుతోంది. అగ్రరాజ్యం అమెరికా, రష్యా, చైనా మాదిరిగా త్రివిధ దళాలకు ఒకే కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందులో భాగంగా 'థియేటర్ లెవెల్ కమాండ్'ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఇది ఏర్పాటైతే ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ కలిసి ఉమ్మడి ఆపరేషన్స్ విశాఖలోనే నిర్వహించనున్నాయి.

37 ప్రాజెక్టులు.. రూ.2,192 కోట్లు

ఈఎన్‌సీలో సాంకేతిక మౌలిక సదుపాయాలు గణనీయమైన పురోగతిని సాధించే దిశగా రూ.2192 కోట్లతో 37 ప్రాజెక్టులు చేపట్టారు. రన్‌వేల భద్రతా నిబంధనలకు అనుగుణంగా విశాఖ విమానాశ్రయం రన్‌వే పునరుద్ధరణ ప్రక్రియ పూర్తి చేశారు. అనుబంధంగా నేవల్ ఎయిర్ బేస్ ఐఎన్‌ఎస్ డేగాలో ఎయిర్‌ఫీల్డ్ లైటింగ్ సిస్టమ్ అప్‌గ్రేడేషన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇవి అందుబాటులోకి వస్తే భారత నౌకాదళం విశాఖ నగరానికి ప్రపంచ స్థాయి ఎయిర్‌ఫీల్డ్‌ను అందించినట్లు అవుతుంది.

కె-4 మిసైల్ ప్రయోగం జరిగిన తొలి నగరం



గత నెల 28న అణ్వాయుధ సామర్థ్యం గల బాలిస్టిక్ మిసైల్‌ను విశాఖ తీరంలో విజయవంతంగా నిర్వహించింది. విశాఖపట్నం షిప్‌బిల్డింగ్ సెంటర్‌లో నిర్మించిన న్యూక్లియర్ సబ్‌మెరైన్ ఐఎన్‌ఎస్ అరిఘాత్ నుంచి కే4 బాలిస్టిక్ మిసైల్‌ని పరీక్షించగా.. 3,500 కి.మీ రేంజ్‌ను అత్యంత వేగవంతంగా ఛేదించింది. భారత్ అణునిరోధక శక్తిని పెంచే సామర్థ్యం గణనీయంగా పెరిగి.. అగ్రదేశాలకు విశాఖ నుంచి సవాల్ విసిరింది. ఈ ప్రయోగంతో చైనాతో పోటీగా భారత్ నిలిచింది. ఇప్పటివరకు సబ్‌మెరైన్ల నుంచి మిసైల్ దాడి చేయగల సామర్థ్యం ఆసియా దేశాల్లో కేవలం చైనాకు మాత్రమే ఉండేది. కే–4 బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం తర్వాత సబ్‌మెరైన్ నుంచి అణుదాడి చేయగల సామర్థ్యం కలిగి ఉన్న ఆసియా దేశాల్లో రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. భవిష్యత్‌లో మరో అణు జలాంతర్గామి భారత్ అమ్ముల పొదిలోకి రానుంది. ఇది వస్తే 5000 కి.మీ రేంజ్ ఉన్న కే5 మిసైల్స్‌ను కూడా ప్రయోగించే సామర్థ్యం భారత్ సొంతం కానుంది.

ఆయుధ సంపత్తిలోనూ..

ఈఎన్‌సీ ఆయుధ సంపత్తి విషయంలోనూ బలోపేతమవుతోంది. ఐఎన్‌ఎస్ ఢిల్లీ, ఐఎన్‌ఎస్ ముంబయి, ఐఎన్‌ఎస్ మైసూర్ యుద్ధ నౌకలు త్వరలో విశాఖ నుంచి కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న 20 నుంచి 25 యుద్ధ నౌకలు 2037 నాటికి తూర్పు నౌకాదళ అమ్ముల పొదిలో చేరనున్నాయి. ఇందులో నీలగిరి క్లాస్ ఫ్రిగేట్‌లు, నెక్ట్స్ జనరేషన్ కార్వెట్ క్లాస్ షిప్‌లు, డైవింగ్ సపోర్ట్ వెసెల్స్, సర్వే వెసల్స్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్‌లు, వాటర్ క్రాఫ్ట్‌లు ఉన్నాయి. ఇప్పటికే నేవీ అమ్ముల పొదిలో న్యూక్లియర్ సబ్‌మెరైన్ ఐఎన్‌ఎస్ అరిఘాత్ వచ్చి చేరింది. మల్టీ రోల్ 60 ఆర్ 60 ఆర్ అప్‌గ్రేడ్ చేసిన యాంటీ సబ్‌మెరైన్ కమోవ్, 28 హెలికాప్టర్లు, మీడియం లిఫ్ట్ ఇ–295 ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూడా విశాఖలో కేంద్రీకృతం కానున్నాయి. భారత నౌకాదళానికి డైవింగ్ సపోర్టు షిప్‌లను హిందూస్థాన్ షిప్‌యార్డులోనే నిర్మిస్తుండటం విశేషం. ఐఎన్‌ఎస్ విక్రాంత్ సైతం విశాఖ కేంద్రంగా త్వరలోనే సేవలందించనుంది.

కొనసాగిన 'ముసురు'

- నేటి సాయంత్రానికి తగ్గుముఖం పట్టనున్న వాన



సాక్షి, విశాఖపట్నం : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ ప్రభావం విశాఖలో కొనసాగుతోంది. రెండు రోజులుగా ముసురు వాతావరణం నగర వాసులను కలవరపెడుతోంది. నిరంతరంగా కురుస్తున్న వానతో పాటు చలి తీవ్రత పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల వర్షం నీరు నిల్వ ఉండిపోయింది. వాహనచోదకులు అవస్థలు పడ్డారు. సోమవారం సాయంత్రం వరకూ వర్ష ప్రభావం నగరంపై కొనసాగుతుందని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దనీ.. సందర్శకులు సముద్ర స్నానాలు చేయవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

గత 24 గంటల్లో కురిసిన వర్షపాతం

ప్రాంతం	వర్షపాతం (మి.మీలో)	ప్రాంతం	వర్షపాతం (మి.మీలో)
		విశాలాక్షి నగర్	30.0
		ఆరిలోవ	27.0
రుషికొండ	38.0	మారికవలస	26.5
జూపార్క్	36.0	సీతమ్మధార	26.5
ఎండాడ	35.0	గంభీరం	25.5
సాగర్‌నగర్	34.75	అశీల్‌మెట్ట	24.5
మధురవాడ	32.5	పెందుర్తి	23.75
కొమ్మాది	31.5	పెదగంట్యాడ	23.0

మైదాన ప్రాంతానికి బదిలీ కోసం..

- ఏజెన్సీకి వెళ్లిన ఉపాధ్యాయుల ఆందోళన పర్వం
- విశాఖలో సమావేశమైన ఉపాధ్యాయులు
- భవిష్యత్ కార్యాచరణపై చర్చ



గోపాలపట్నం హైస్కూల్‌లో సమావేశమైన టీచర్లు

విశాఖ విద్య: ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన ఉపాధ్యాయులను తిరిగి మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలనే డిమాండ్ ఊపందుకుంది. ఆదివారం గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులంతా సమావేశమయ్యారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 420 మంది ఉపాధ్యాయులను అనివార్యంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేశారు. వీరిలో 50 ఏళ్లకు పైబడినవారు, రిటైర్మెంట్‌కు సమీపంలో ఉన్న వారే ఎక్కువగా ఉన్నారు. 200 మందికి పైగా మహిళా ఉపాధ్యాయులు ఉండటంతో వీరంతా తిరిగి మైదాన ప్రాంతాలకు ఎప్పుడు వస్తామా అని ఎదురుచూస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం బదిలీల చట్టం చేస్తుందనే ప్రచారంతో ఇక తామంతా ఏజెన్సీలోనే ఉండాల్సి వస్తుందేమోననే ఆందోళనతో ఉపాధ్యాయులు పోరుబాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన రెండు వందల మంది వరకు ఉపాధ్యాయులు విశాఖలో ఆదివారం సమావేశమయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఏజెన్సీలో మండలానికి ఇద్దరు ఉపాధ్యాయులు చొప్పున నాయకత్వం వహించేలా, భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాల్లో మిగతా వారందరినీ భాగస్వాములను చేసేలా నిర్ణయించారు. త్వరలో చేపట్టబోయే బదిలీల్లో తమకు ప్రాధాన్యం ఇచ్చి, మైదాన ప్రాంతానికి తిరిగి పంపించేలా వివిధ రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా కార్యాచరణకు సిద్ధం కావాలని తీర్మానించారు.

క్రిస్మస్ సందడి షురూ..



నగరంలో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. నోవాటెల్‌లో ఆదివారం నిర్వహించిన క్రిస్మస్ ట్రీ లైటింగ్ కార్యక్రమం అతిథులను అలరించింది. విదేశీ గాయకులు ప్రత్యేక గీతాలు ఆలపించి వేడుకకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చారు. శాంతాక్లాజ్‌లతో పిల్లలు ఉత్సాహంగా ఆడుకున్నారు. క్రిస్మస్ వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ అలంకరించిన హోటల్ పరిసరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులతో కలిసి క్రిస్మస్ ట్రీ లైట్లు వెలిగించడం వేడుకకు హైలైట్‌గా నిలిచింది. హోటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పియానోను సంస్థ చైర్మన్ ప్రభు కిశోర్ ప్రారంభించారు. ప్రముఖ పియానో శిక్షకుడు పాల్ పలు గీతాలను పియానోపై పలికించిన తీరు అతిథులను అలరించింది.



\- ఏయూక్యాంపస్

బకాయిలు చెల్లించరా..?



రైవాడ

- 4 రిజర్వాయర్ల నుంచి జీవీఎంసీకి నీటి సరఫరా
- ఇరిగేషన్ శాఖకు రూ.210.9 కోట్ల బకాయిలు
- భారంగా మారిన ప్రాజెక్టుల నిర్వహణ

మహారాణిపేట: విశాఖ నగరానికి తాగునీటిని సరఫరా చేస్తున్న జలవనరుల శాఖకు ఏటా బకాయిలు పేరుకుపోతున్నా.. జీవీఎంసీ చెల్లింపుల ఊసెత్తడం లేదు. జలవనరుల శాఖ అధికారులు బకాయిలు చెల్లించాలని లేఖలు రాసినా పట్టించుకోవడం లేదు. దీంతో రిజర్వాయర్ల నిర్వహణ తలకు మించిన భారంలా తయారైంది. జలవనరుల శాఖకు చెందిన నాలుగు రిజర్వాయర్ల నుంచి సరఫరా చేస్తున్న తాగునీటికి రూ.210.9 కోట్లు జీవీఎంసీ చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే బకాయిల చెల్లింపుల కోసం అధికారులు పలుమార్లు జీవీఎంసీకి నోటీసులు జారీ చేశారు. తాజాగా జల వనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కూడా పట్టణ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాసినట్లు తెలుస్తోంది.

తలకు మించిన భారం

విశాఖ ప్రజల తాగునీటి అవసరాల కోసం మేహాద్రి గెడ్డ, రైవాడ, గంభీరం, తాటిపూడి రిజర్వాయర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. వీటిని జలవనరులశాఖ నిర్మించినా అధికశాతం నీరు విశాఖ నగర అవసరాలకే సరఫరా అవుతోంది. ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను జలవనరులశాఖ పర్యవేక్షిస్తోంది. ప్రతి ప్రాజెక్టుకు ఇంజనీర్లు, సహాయకులు, టెక్నీషియన్లు, హెల్పర్లను ప్రభుత్వం కేటాయించింది. దీనికితోడు ప్రాజెక్టుల నిర్వహణ, విద్యుత్ సరఫరాకు ఖర్చు అవుతుంది. జనరేటర్ నిర్వహణ బాధ్యతలను, ఇతర ఖర్చులను కూడా ఇరిగేషన్ శాఖే భరిస్తోంది. ప్రాజెక్టులు నిర్మించి దశాబ్దాలు గడిచాయి. సిబ్బంది క్రమేణా ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వారి స్థానంలో కొత్త నియామకాల్లేవు. ఇదే సమయంలో ప్రాజెక్టుల నిర్వహణకు ప్రభుత్వం నిధుల విడుదలను తగ్గిస్తూ వచ్చింది. ఏళ్ల తరబడి బకాయిలను జీవీఎంసీ చెల్లించకపోవడంతో రిజర్వాయర్ల నిర్వహణ తలకు మించిన భారంలా తయారైంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల ద్వారా సరఫరా చేస్తున్న నీటికి చెల్లింపులు జరపాలని జీవీఎంసీకి జలవనరులశాఖ అధికారులు లేఖలు రాస్తున్నారు. అయినా చెల్లింపులు చేయడం లేదు.

రూ.210.9 కోట్లు బకాయిలు



మేహాద్రిగెడ్డ

రైవాడ రిజర్వాయర్ నుంచి ప్రతి రోజూ 50 క్యూసెక్కుల చొప్పున ఏడాదికి 1.6 టీఎంసీల నీటిని జీవీఎంసీకి అందిస్తున్నారు. దీని నిమిత్తం ఏడాదికి రూ.5.42 కోట్లు చెల్లించాల్సి ఉంది. 169 అడుగుల నీటి సామర్థ్యం గల మేహాద్రి రిజర్వాయర్ మొత్తం విశాఖ నగరవాసుల కోసం వినియోగిస్తున్నారు. ఇందుకు జీవీఎంసీ ఏటా 1.60 కోట్లు చెల్లించాల్సి ఉంది. అలాగే తాటిపూడి నుంచి 11 ఎంజీడీలు నీరు జీవీఎంసీకి సరఫరా అవుతుంది. ఇందుకు జీవీఎంసీ సంవత్సరానికి రూ.12 లక్షలు చెల్లించాల్సి ఉంది. గంభీరం రిజర్వాయర్‌కు కూడా భారీ బకాయిలు ఉన్నాయి. మొత్తంగా ఈ నాలుగు రిజర్వాయర్లకు రూ.210.9 కోట్లు జీవీఎంసీ చెల్లించాల్సి ఉంది. గత ఏడాది రూ.1.2 కోట్లు మాత్రమే చెల్లించింది. మిగతా బకాయిలను చెల్లించాలని జలవనరుల శాఖ అధికారులు లేఖలు రాసినా ఉపయోగం కనిపించడం లేదు.

రిజర్వాయర్లు	పాత బకాయిలు	2024 సం.	మొత్తం బకాయిలు
రైవాడ	రూ.151 కోట్లు	రూ.5 కోట్లు	రూ.156 కోట్లు
మేహాద్రిగెడ్డ	రూ.48 కోట్లు	రూ.1.6 కోట్లు	రూ.49.6 కోట్లు
గంభీరం	రూ.4.23 కోట్లు	0.13 లక్షలు	రూ.4.36 కోట్లు
తాటిపూడి	రూ.0.82 లక్షలు	రూ.0.12లక్షలు	రూ.0.94 లక్షలు
మొత్తం	రూ.204.05 కోట్లు	రూ.6.85 కోట్లు	రూ.210.9 కోట్లు



నేటి నుంచి 41 రోజుల మండల దీక్ష

12 నుంచి 32 రోజుల దీక్ష

సింహగిరిపై దీక్షాధారులకు మాలధారణ

జనవరి 12న రెండు దీక్షల ముగింపు





శ్రీనృసింహ దీక్ష.. సర్వ జగద్రక్ష

మహిమాన్వితమైనది శ్రీ నృసింహ దీక్ష



శ్రీ నృసింహ దీక్ష ఎంతో మహిమాన్వితమైనది. శ్రీనృసింహ దీక్షలు దశదిశలా విస్తరించాలని, దీక్షలు తీసుకునే భక్తుల సంఖ్య గణనీయంగా పెరగాలని పీఠం తరపున విశేషంగా కృషి చేస్తున్నాం. దీక్షధారుల కోరిక మేరకు 2015 నుంచి దేవస్థానం శ్రీనృసింహ దీక్షలను అధికారికంగా నిర్వహిస్తుండటం సంతోషంగా ఉంది. ఈ ఏడాది మా పీఠం తరపున ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 1,000 మంది వరకు మండల దీక్ష చేపడుతున్నారు.

– సానబోయిన రాజు, గురుస్వామి, చందన పెరుమాళ్ పీఠం, సింహాచలం

సింహాచలం: ఈ ఏడాది శ్రీ నృసింహ దీక్షల స్వీకరణకు సమయం ఆసన్నమైంది. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామిని దీక్షలతో కొలిచేందుకు భక్తులు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి 41 రోజుల మండల దీక్ష, ఈ నెల 12వ తేదీ నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభవుతుంది. ఈ నేపథ్యంలో మండల దీక్ష ఆచరించే భక్తులకు సింహగిరిపై ఉదయం 7 గంటలకు దేవస్థానం వైదికులు మాలధారణ చేస్తారు. వచ్చే ఏడాది జనవరి 12న దీక్షధారులంతా దీక్ష విరమించాల్సి ఉంటుంది. సోమవారం జరిగే మాలధారణ ఏర్పాట్లను ఆదివారం ఈవో త్రినాథరావు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

సింహాచలం దేవస్థానం 2015 నుంచి శ్రీ నృసింహ దీక్షలను అధికారికంగా నిర్వహిస్తోంది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దీక్షతో కొలవాలని అడవివరానికి చెందిన కొందరు భక్తులు సుమారు 21 ఏళ్ల కిందట సంకల్పించారు. చందన దీక్షగా నామకరణం చేసి.. ఒక పీఠంగా ఏర్పడి దీక్ష ప్రారంభించారు. అలా ఏడాదికేడాదికి దీక్షాధారులు పెరిగారు. దానికణుగుణంగానే పీఠాల సంఖ్య కూడా పెరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఏజెన్సీ ప్రాంతాలైన ముంచంగిపుట్టు, హుకుంపేట, దుంబ్రిగుడ, అరకు, జి.మాడుగుల, పాడేరు, చెరువుపాకల, పెదగూడ, కుమ్మరిపుట్, చోడవరం, మాడుగుల, తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో గిరిజనులు దీక్ష తీసుకోవడం ప్రారంభించారు. ఒడిశాలోని ఛత్రపూర్, బరంపురం, గోపాలపురం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు, తెలంగాణకు చెందిన పలువురు భక్తులు దీక్షను స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే చందన దీక్షలను అధికారికంగా నిర్వహించాలని దీక్షాధారులంతా సింహాచలం దేవస్థానం అధికారులను కోరారు. దీనిపై పోరాటం కూడా చేశారు. ఎట్టకేలకు 2015లో చందన దీక్షలను శ్రీనృసింహ దీక్షలుగా నామకరణం చేసి దేవస్థానం అధికారికంగా ప్రారంభించింది. దీక్ష ముగింపు రోజున స్వామికి సమర్పించే ద్రవ్యాల మూటను తిరుముడిగా దేవస్థానం అర్చకులు నామకరణం చేశారు.

పీఠం ఏర్పాటు చేసే విధానం

దీక్షాధారులు స్వయంగా గానీ సామూహికంగా గానీ పవిత్రమైన ప్రదేశంలో పీఠాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక పీటపై విష్వక్సేనుడు, నృసింహస్వామి, లక్ష్మీదేవి, గోదాదేవి ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రాతఃకాలంలో స్వామికి సుప్రభాత సేవ నిర్వహించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో విష్వక్సేన ఆరాధన, లక్ష్మీ అష్టోత్తరంతో లక్ష్మీదేవిపూజ, నృసింహ అష్టోత్తరంతో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి పూజ చేయాలి. ధనుర్మాసం రోజుల్లో గోదాదేవిని పూజించాలి. పూజానంతరం స్వామి వైభవాన్ని కీర్తించాలి. రాత్రి పవళింపు సేవ నిర్వహించాలి.

పాటించాల్సిన నియమాలు

శ్రీనృసింహ దీక్షను తీసుకునే భక్తులు చందనం రంగు వస్త్రాలు ధరించాలి. నుదుటన తిరునామం ధరించాలి. బ్రహ్మీ ముహూర్తంలో నిద్రలేవాలి. నది/తటాకం/బావి నీటితో స్నానం చేయాలి. బ్రహ్మచర్యం పాటించాలి.

తిరుముడి ద్రవ్యాలివే..

కొబ్బరి కురిడీలు, చందనం చెక్క, పట్టువస్త్రం, ఆవు నెయ్యి, ముద్ద కర్పూరం, యాలకులు, లవంగాలు, జాజికాయ, జాపత్రి, కుంకుమ పువ్వు, పచ్చ కర్పూరం, జీడిపప్పు, కిస్మిస్, పటిక బెల్లంను తిరుముడిగా కట్టుకుని స్వామికి సమర్పించాలి.



మాలధారణ చేస్తున్న దేవస్థానం వైదికులు(ఫైల్)

మాలధారులకు సౌకర్యాలన్నీ కల్పిస్తున్నాం



శ్రీ నృసింహ దీక్షాధారులకు దేవస్థానం తరఫున అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఈ నెల 2, 12 తేదీల్లో దీక్షలు స్వీకరించే వారికి సింహగిరిపైనే మాలధారణ చేస్తాం. తులసిమాల, స్వామి వారి ప్రతిమను దేవస్థానం ఉచితంగా అందిస్తుంది. దీక్ష రోజుల్లో అన్నప్రసాద భవనంలో మధ్యాహ్నం భోజనం అందిస్తాం. ఉచితంగా స్వామి దర్శనం కల్పిస్తాం. దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుంది. జనవరి 12న దీక్ష విరమణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తాం.

–వి.త్రినాథరావు, ఈవో, సింహాచలం దేవస్థానం

వర్షంతో మ్యాచ్‌ల రద్దు

ఆధిక్యంలో విదర్భ

విశాఖ స్పోర్ట్స్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం జరగాల్సిన రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. టాస్ వేయకుండానే మ్యాచ్‌లు రద్దయినట్లు నిర్వాహకులు ప్రకటించారు. గ్రూప్ డీలో భాగంగా ఛత్తీస్‌గఢ్‌తో ఒడిశా, విదర్భతో రైల్వేస్ జట్లు తలపడాల్సి వుండగా.. మ్యాచ్‌లు రద్దు కావడంతో జట్లకు రెండేసి పాయింట్లు కేటాయించారు. దీంతో ఒడిశా రెండు పాయింట్లు సాధించగలిగింది. విదర్భ 14 పాయింట్లతో ఆధిక్యంలోకి దూసుకెళ్లగా.. అసోం, చండీగఢ్ జట్లు 12, పుదుచ్చేరి 8, రైల్వేస్, ఛత్తీస్‌గఢ్ జట్లు 6 పాయింట్లతో తదుపరి మ్యాచ్‌లు ఆడనున్నాయి. 3న అసోంతో ఒడిశా, చండీగఢ్‌తో రైల్వేస్ తలపడనున్నాయి.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా 'హక్కుల మార్గాన్ని అనుసరించండి– నా ఆరోగ్యం, నా హక్కు' అనే నినాదంతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు సంయుక్తంగా కలెక్టరేట్ నుంచి ఆంధ్రా మెడికల్ కాలేజీ వరకు ర్యాలీ చేశారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ప్లకార్డులు ప్రదర్శించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. అనంతరం ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఎయిడ్స్‌పై అవగాహన ముఖ్యమన్నారు.

జిల్లాలో ఎయిడ్స్/హెచ్ఐవీ నివారణ కోసం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, వివిధ సంస్థలు ద్వారా అందిస్తున్న సేవల గురించి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు వివరించారు. అనంతరం హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధిత పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలెక్టర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అల్పాహారం చేశారు. వారితో మాట్లాడి యోగక్షేమాలు, సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఇస్తున్న మందులు, ఇతర వివరాలతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎయిడ్స్ నియంత్రణలో ఉత్తమ సేవలందించిన వారికి, వివిధ పోటీల్లో విజేతలకు కలెక్టర్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, మెడికల్ కాలేజీ ఎస్‌పీఎం విభాగాధిపతి డాక్టర్ కృష్ణవేణి, దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వైజాగ్ మారథాన్







మారథాన్‌లో పాల్గొన్న విదేశీయులు, దివ్యాంగురాలు, తల్లితో చిన్నారి

ఏయూక్యాంపస్: నగర ప్రజల సంకల్పానికి ప్రకృతి సహకరించింది. విశాఖ వాసులు ఉత్సాహాన్ని చూసి వరుణుడు కరుణ చూపాడు. దీంతో ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులో నిర్వహించిన 'వైజాగ్ మారథాన్' ఆహ్లాదకర వాతావరణంలో ఉత్సాహభరితంగా సాగింది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ, సంధ్య మెరైన్ సంయుక్తంగా బీచ్‌రోడ్డులో పార్క్ హోటల్ వద్ద నుంచి వైజాగ్ మారథాన్ నిర్వహించాయి. ముందుగా 21 కిలోమీటర్ల పరుగు, తర్వాత 10 కిలోమీటర్ల పరుగు, చివరగా 5, 3 కిలోమీటర్ల పరుగు ప్రారంభమైంది. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో నగరం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. ఐదేళ్ల పిల్లల నుంచి ఆరు పదులు దాటిన వృద్ధుల వరకు ఇందులో భాగస్వాములయ్యారు. పలువురు విదేశీయులు సైతం పరుగు పోటీలో పాల్గొన్నారు. విద్యార్థులు బీచ్‌రోడ్డులో పరుగులు తీస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా వైజాగ్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణ రాయ్ మాట్లాడుతూ నగరవాసులు వయోబేధం లేకుండా ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సంధ్య మెరైన్ డైరెక్టర్ రమేష్, హైదరాబాద్ రన్నర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేష్ వెచ్చా, యూబీఐ జీఎం షాలినీ మీనన్, అపోలో హాస్పిటల్స్ ప్రతినిధి సీవోవో రామచంద్ర, యంగ్ ఇండియా ప్రతినిధులు, దివీస్ లేబొరేటరీ జీఎం ప్రద్యుమ్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు 10 రూపాయల నాణాలపై అవగాహన కల్పించారు. వైఎంసీఏ వద్ద ఏర్పాటు చేసిన పోలీసుల ప్రత్యేక బ్యాండ్ రన్నర్స్‌లో ఉత్సాహం నింపింది.

ఐఎన్ఎస్ విశ్వకర్మలో బీవోబీ ఏటీఎం ప్రారంభం



ఏటీఎం ప్రారంభోత్సవంలో పాల్గొన్న రియర్ అడ్మిరల్ ఎంఎంఎస్ రాజు, అధికారులు

మహారాణిపేట: ఐఎన్ఎస్ విశ్వకర్మలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంను ఏర్పాటు చేసింది. ఈ ఏటీఎంను ఆదివారం రియర్ అడ్మిరల్ ఎంఎంఎం రాజు ప్రారంభించారు. భారత తూర్పు నౌకాదళ కమాండ్‌కు ఉన్నత బ్యాంకింగ్ సేవలను అందించడానికి నిరంతర ప్రయత్నంలో భాగంగా ఈ ఏటీఎంను ఏర్పాటు చేసినట్లు బ్యాంక్ వర్గాలు తెలిపాయి. ఐఎన్ఎస్ విశ్వకర్మ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ పంకజ్ శర్మ, ఇతర అధికారులు, నేవీ సిబ్బంది, బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అపోహలు వీడి అంతం చేద్దాం

బీచ్‌రోడ్డులో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులు



వైద్య విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

ఏయూక్యాంపస్: ఎయిడ్స్‌ని దూరం పెడదాం.. వ్యాధిగ్రస్తులను కాదని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రా మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ జరిగింది. బీచ్‌రోడ్డు పార్క్ హోటల్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఈ ర్యాలీని డాక్టర్ శివానంద్ ప్రారంభించారు. అనంతరం వైఎంసీఏ వద్ద రోడ్డుపై ప్లకార్డులు, 50 మీటర్ల రెడ్‌రిబ్బన్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ 2030 నాటికి ఎయిడ్స్‌ను నియంత్రించడం లక్ష్యమన్నారు. ప్రపంచ దేశాలన్నీ 95–95–95 లక్ష్యంగా ఏర్పరచుకున్నాయన్నారు. దీని ఉద్దేశం 95 శాతం ఎయిడ్స్‌ని గుర్తించడం, 95 శాతం ట్రీట్‌మెంట్ తీసుకోవడం, 95 శాతం వైరల్ లోడ్ తగ్గే విధంగా చూడటం లక్ష్యంగా పని చేస్తున్నాయన్నారు. ప్రజల్లో అపోహలు తొలగించడం, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను అందరితో సమానంగా చూడటం, సమాజంలో భాగం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. సెక్స్ ఎడ్యుకేషన్, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఫ్లాష్ మాబ్ ఎంతగానో ఆకట్టుకుంది. ఏఎంసీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ఎ.కృష్ణవేణి, అమెరికాకు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ విజయ, ఏఎంసీ ఆచార్యులు, పీజీ, ఎంబీబీఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడ కబడ్డీకి మరింత ప్రోత్సాహం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



కబడ్డీ నూతన అసోసియేషన్ సభ్యులు

బీచ్‌రోడ్డు: గ్రామీణ క్రీడ కబడ్డీని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని రాష్ట్ర మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కబడ్డీని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింతగా తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు క్రీడాకారులకు విద్య, ఉపాధి అవకాశాల్లో 2 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 3 శాతానికి పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ఖేలో ఇండియా, ఆసియన్ గేమ్స్, ఒలింపిక్స్ తదితర క్రీడా పోటీల్లో విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున బహుమతులు అందిస్తున్నామన్నారు. క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ తదితర క్రీడలతో సమానంగా కబడ్డీని ఆదరించి, కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు.

అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అధ్యక్షుడిగా విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పద్మ, శ్రీకాకుళం కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.చిరంజీవి, విజయనగరం కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, విశాఖపట్నం కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.గోపి, పలువురు కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా 'ఉక్కు'ను కాపాడుకుందాం

బీఎస్పీ జాతీయ కో–ఆర్డినేటర్, ఎంపీ రాంజీ



మాట్లాడుతున్న బీఎస్పీ జాతీయ కో–ఆర్డినేటర్ రాంజీ

అగనంపూడి: 'అంతా కలిసికట్టుగా విశాఖ ఉక్కును కాపాడుకుందాం. బీఎస్పీ తరపున దేశ వ్యాప్త ఉద్యమాలు నిర్వహిస్తాం. పార్లమెంట్‌లో గళం వినిపిస్తాం.' అని బీఎస్పీ జాతీయ కో–ఆర్డినేటర్, ఎంపీ రాంజీ గౌతమ్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా బీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం కూర్మన్నపాలెం కూడలిలో బహుజన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రాంజీ మాట్లాడుతూ 23 ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం అమ్మేసిందని, ఆంధ్రులకు గర్వకారణమైన విశాఖ ఉక్కును నేడు అమ్మకానికి పెట్టిందన్నారు. అదానీ లేదా జిందాల్ చేతుల్లోకి విశాఖ ఉక్కు కర్మాగారం వెళ్లిపోతే బలహీన వర్గాలు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీలకు భవిష్యత్ జీవనాధారం ఉండదన్నారు. నాలుగు లక్షల కోట్ల విలువైన స్టీల్‌ప్లాంట్‌ను రూ.25 వేల కోట్లకు అమ్మేస్తే రానున్న రోజుల్లో రిజర్వేషన్లు ఉండవన్నారు. బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్, విశ్రాంత డీజీపీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సమస్య ఉద్యోగులదనే భావన ప్రజల్లో ఉందని, అలా భావిస్తే ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరగడం ఖాయమన్నారు. ఉత్తరాంధ్రకు వలస నాయకుల వల్లే తీరని నష్టం జరుగుతోందని, ఉత్తరాంధ్రలో బలమైన నాయకులుగా ఉన్న వారు కూడా గొంతెత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్టీల్‌ప్లాంట్‌పై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకమై విశాఖ ఉక్కుకు సొంత గనులు లేకుండా చేశాయని ఆరోపించారు. లక్నో నుంచి విశాఖ ఉక్కు కర్మాగారం కాపాడడం కోసం బీఎస్పీ నేతలు ఇక్కడికి వస్తే.. ఉత్తరాంధ్రకు చెందిన ప్రజాప్రతినిధులు కలిసి రాకపోవడం సిగ్గుచేటన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు సౌమ్యులని, దీన్ని ఆసరాగా తీసుకుని వలస నేతలు దోచుకుంటున్నారని ఆరోపించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి మాట్లాడుతూ విశాఖ ఉక్కును కాపాడు కోవాలనే సంకల్పంతో బీఎస్పీ ఉందని, పరిరక్షణకు తమవంతు కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులు బాలయ్య, లకే రాజారా వు, ప్రజా సంఘాల నాయకులు వి.వి.రమణమూర్తి, ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, మార్టుపూడి పరదేశి, వరసాల శ్రీనివాసరావు, మాటూరి శ్రీనివాసరావు, జొన్నకూటి విజయ్‌కుమార్, ఓబీసీ నాయకులు పూర్ణచంద్రరావు, రమణ, సత్యనారాయణ, డేవిడ్, గణపతిరెడ్డి, కారు రమణ, రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏయూపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



సంఘంలో చేరిన వారికి సభ్యత్వం అందజేస్తున్న బాలాజీ

విశాఖ విద్య: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు శివన్న గారి బాలాజీ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో జరిగిన జిల్లా బాధ్యుల సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక సంబంధ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. 12వ పే రివిజన్ కమిషన్ వెంటనే నియమించి పీఆర్సీ అమలు జరిగేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై సంఘం తరుపున రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాలకు జిల్లా స్థాయిలో నాయకత్వం వహించిన సుదర్శన పట్నాయక్, ఫణి కుమార్ ఈ సందర్భంగా ఆయన సమక్షంలో సభ్యత్వాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అరుణ్ కుమార్, త్రినాథమూర్తి, కోశాధికారి ఎం.ఎస్.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి వల్లే మానసిక వ్యాధులు

విశ్రాంత డీఎంఈ డాక్టర్ సుబ్బారావు



సదస్సును ప్రారంభిస్తున్న విశ్రాంత డీఎంఈ డాక్టర్ సుబ్బారావు

మహారాణిపేట: ప్రస్తుత సమాజంలో మానసిక వైద్యానికి ప్రాముఖ్యం పెరిగిందని, ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు ఇటువంటి సదస్సులు దోహదం చేస్తాయని విశ్రాంత డీఎంఈ డాక్టర్ ఎస్.సుబ్బారావు తెలిపారు. గాయత్రి వైద్య కళాశాల ఆధ్వర్యంలో అంకోసా ఆడిటోరియంలో నిర్వహించిన భారత మానసిక వైద్యుల రాష్ట్ర విభాగం 13వ పీజీ నిరంతర విద్యా సదస్సును ఆయన ప్రారంభించి, మాట్లాడారు. మానసిక వ్యాధులపై నిరంతర పరిశోధనలు జరగాలన్నారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ మానసిక వైద్యంలో వస్తున్న నూతన పోకడలు శాస్త్రజ్ఞులను అమితంగా ఆకర్షిస్తున్నాయని, భవిష్యత్తులో మెదడు, నాడీవ్యవస్థల విజ్ఞానం మానసిక వ్యాధుల పరిష్కారంలో మమేకమవుతుందన్నారు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి ప్రసంగిస్తూ వైద్య విద్యార్థులు మానసిక వైద్యాన్ని ఐచ్ఛికంగా అభ్యసించేందుకు ముందుకు రావడం ముదావహమన్నారు. సదస్సు కార్య నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.రాజు మాట్లాడుతూ పలు రకాల ఒత్తిళ్ల వల్ల మానసిక వ్యాధుల బారిన పడేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. భారత మానసిక వైద్యుల సంఘం ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీవీఎస్ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మానసిక వైద్య నిపుణుల ప్రసంగాలతోపాటు, వృత్తి అవకాశాలపై చర్చా వేదికలు నిర్వహించారు. 270 మంది వైద్య విద్యార్థులు, 50 మంది నిపుణులు హాజరయ్యారు. ప్రముఖ మానసిక వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఐ.శరత్ చంద్ర, ఉపాధ్యక్షుడు లోకేష్‌రెడ్డి, కోశాధికారి కిశోర్, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు కలిసి రండి

ప్రజాశాంతి అధ్యక్షుడు కె.ఎ.పాల్

సీతమ్మధార: రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించడానికి ప్రజలంతా తనతో కలిసిరావాలని ప్రజాశాంతి అధ్యక్షుడు కె.ఎ.పాల్ పిలుపునిచ్చారు. ఆశీలమెట్టలోని కె.ఎ.పాల్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పార్టీలన్నింటికీ తెలిసినా.. ఎందుకు సాధించలేకపోతున్నారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌కు తీరని అన్యాయం చేస్తున్న కూటమి పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. దేశంలో ఈవీఎంలతోనే ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని, బ్యాలెట్ వినియోగాన్ని చాలా దేశాలు అనుసరిస్తున్న విషయం గుర్తించాలన్నారు. హామీలు అమలులో సీఎం చంద్రబాబు ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. విశాఖ ఎంపీ భరత్ ఈ ఆరు నెలల్లో ఏం చేశారని కె.ఎ.పాల్ ప్రశ్నించారు.